బీమాతో రైతన్నకు ధీమా



పంట నష్టం అంచనాలను నమోదు చేస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది (ఫైల్)

- మండలంలో 4,684 మంది రైతులు
- రూ. 1.12 కోట్లు వాతావరణ ఆధారిత బీమా మంజూరు
- 2022–23 ఖరీఫ్‌లో అకాల వర్షాలకు దెబ్బతిన్న పత్తి రైతులకు వర్తింపు
- ఆర్‌బీకేల్లో లబ్ధిదారుల జాబితాల ప్రదర్శన
- 3వ తేదీ వరకు అభ్యంతరాలకు అవకాశం

ప్రత్తిపాడు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతి విషయంలోనూ రైతాంగానికి అండగా నిలుస్తున్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి చిత్తశుద్ధితో రైతాంగ శ్రేయస్సుకు నిర్విరామంగా కృషి చేస్తున్నారు. పంట నష్టం జరిగిన సీజన్‌లోనే పంట నష్టపరిహారం అందిస్తామన్న మాటను నిలబెట్టుకుంటూ సీఎం వాతావరణ ఆధారిత బీమా ఇన్సూరెన్స్‌ను మంజూరు చేశారు. ఏకంగా మండలానికి కోటి పన్నెండు లక్షల రూపాయలు మంజూరయ్యాయి.

2022–23 ఖరీఫ్ సీజన్‌లో ప్రత్తిపాడు మండలంలో మొత్తం 8,287 ఎకరాల్లో రైతులు పత్తి పంటను సాగు చేశారు. ప్రతికూల వాతావరణంలో కురిసిన భారీ అకాల వర్షాలతో పత్తి పైర్లు దెబ్బతినడంతో రైతులు నష్టపోవలసి వచ్చింది. దీంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవసాయశాఖ అధికారులు పంట నష్టం అంచనాలు తయారుచేసి ప్రభుత్వానికి నివేదికలు పంపారు. మండలంలో

ఆర్బీకేల వారీగా బీమా వివరాలు..

రైతు భరోసా కేంద్రం	రైతులు	ఎకరాలు	బీమా మంజూరు (రూ.ల్లో)
యనమదల	899	1,372.37	28,32,252
ప్రత్తిపాడు	405	533.37	11,00,720
కోయవారిపాలెం	349	355.31	7,33,230
తిక్కిరెడ్డిపాలెం	125	148.34	3,06,131
గనికపూడి	332	397.56	8,20,437
వంగిపురం	52	70.76	1,46,039
నడింపాలెం	676	704.53	14,53,846
పాతమల్లాయపాలెం	474	632.02	13,04,295
తుమ్మలపాలెం	--	----	-------
గొట్టిపాడు	582	922.43	19,03,673
ప్రత్తిపాడు	790	1103.87	22,76,439
మొత్తం	**4,684**	**6,240.06**	**1,12,77,062**

6,240.06 ఎకరాల్లో పత్తి పంట దెబ్బతిన్నట్లు వ్యవసాయశాఖ అధికారులు నిర్ధారించారు. దీంతో వ్యవసాయశాఖ అధికారుల నివేదికల ఆధారంగా వాతావరణ ఆధారిత పంటల బీమా కింద ఎకరానికి రూ. 2,084 రూపాయల చొప్పున 4,684 మంది రైతులకు గాను రూ. 1,12,77,062 కోట్ల రూపాయల ఇన్సూరెన్స్‌ను ప్రభుత్వం మంజూరు చేసింది.

ఆర్బీకెల్లో లబ్ధిదారుల జాబితాలు

బీమాకు సంబంధించిన లబ్ధిదారుల జాబితాలను నేటి నుంచి ఆర్‌బికెల్లోని నోటీసు బోర్డుల్లో ప్రదర్శించనున్నాం. రైతులు ఒక్కసారి ఆయా గ్రామాల్లోని జాబితాలను పరిశీలించుకోవాలి. జూలై 3వ తేదీ వరకు అభ్యంతరాలకు అవకాశం ఉంది. అభ్యంతరాలున్న రైతులు సంబంధిత గ్రామంలోని ఆర్‌బికె సిబ్బందిని గానీ మండల వ్యవసాయశాఖ కార్యాలయంలో గానీ సంప్రదించాలి.

– అరుణకుమారి, ఏవో, ప్రత్తిపాడు

క్లుప్తంగా

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ 'జగనన్న సురక్ష'



రేటూరు(కాకుమాను): ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఇంటింటికి వెళ్లి లబ్ధిదారుల ఎంపికే లక్ష్యంగా జగనన్న సురక్ష పథకాన్ని అమలు చేయాలని మండల ప్రత్యేకాధికారి తేళ్ల ప్రేమ కుమారి అన్నారు. రేటూరు గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రేమ కుమారి మాట్లాడుతూ ఇప్పటికే అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలను అందిస్తున్నట్లు తెలిపారు. ఇంకా గ్రామాలలో ఎవరైనా ఉంటే వారి వివరాలను నమోదు చేసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో జేసీఎస్ మండల కన్వీనర్ పంగులూరి శ్రీనివాసరావు, దొప్పలపూడి సుందర్ ప్రసాద్, తహసీల్దార్ ప్రసాదరావు, ఎంపీడీఓ రామకృష్ణ, వైస్ సర్పంచ్ వల్లూరి సుధాకర్, సొసైటీ చైర్మన్ చిరంజీవి, ఏపీఎం సోమశేఖర్ పాల్గొన్నారు.

పైపులైన్ నిర్మాణానికి శంకుస్థాపన



పెదకాకాని : తక్కెళ్ళపాడు బాల ఏసు నగర్ లో రూ.20 లక్షల వ్యయంతో శుక్రవారం రాత్రి పైప్ లైన్ నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య శంకుస్థాపన చేశారు. జలజీవన్ మిషన్ ద్వారా బాల ఏసు నగర్ లో ఇంటింటికి కుళాయి కనెక్షన్ ఇవ్వాలని ఆశయంతో పైప్లైన్ నిర్మాణానికి శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. ఈ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యురాలు గోళ్ళ జ్యోతి, ఎంఎస్ఎం ఈ డైరెక్టర్ భీమవరపు విజయలక్ష్మి, స్థానిక నాయకులు పెనుమాల అరుణ్, కిషోర్, కరణం సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్లు నిత్యావసరాలను సక్రమంగా అందజేయాలి



చేబ్రోలు: పేదలకు అందించే నిత్యవసర వస్తువుల పంపిణీలో ఫిర్యాదులు రాకుండా రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు తగిన జాగ్రత్తలు పాటించాలని చేబ్రోలు తహసీల్దారు కేవీ గోపాలకృష్ణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల పరిధిలోని అన్ని గ్రామాలకు చెందిన రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు గోపాలకృష్ణ మాట్లాడుతూ రేషన్ పంపిణీలో ఎండీయూ ఆపరేటర్లపై పలు ఫిర్యాదులు వస్తున్నాయని, అక్రమాలు, అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవటం జరుగుతుందని హెచ్చరించారు. నిత్యవసర వస్తువులను ఇంటింటికి అందించాలని, ప్రజా పంపిణీ వ్యవస్థ సక్రమంగా సమర్ధవంతంగా పని చేయాలన్నారు. రేషన్ పంపిణీపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలిపారు. సివిల్ సప్లయీస్ డీటీ భువనేశ్వరి, రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు పాల్గొన్నారు.

పాఠశాలలకు కొబ్బరి మొక్కలు అందజేత



మామిళ్లపల్లి(చేబ్రోలు): మామిళ్లపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలు, పంచాయతీ కార్యాలయం ప్రాంగణం వద్ద నాటడం కోసం స్వచ్ఛంధ సంస్థ నిర్వహకులు శుక్రవారం కొబ్బరి మొక్కలను అందజేసినట్లు గ్రామ సర్పంచ్ జాలాది యానాదిరావు తెలిపారు. డాడ్ ఫర్ గుడ్ డీడ్స్ మినిస్ట్రీ స్వచ్ఛంధ సంస్థ ప్రతినిధులు తెనాలి నీలాంబరం, దుగ్గిరాల మోజేష్‌ల సహకారంలో 150 కొబ్బరి మొక్కలను అందజేశారు. మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల, పంచాయతీ కార్యాలయాల ప్రాంగణంలో కొబ్బరి మొక్కలు నాటి వాటిని పెంచనున్నట్లు గ్రామ సర్పంచ్ తెలిపారు. పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు.. 'జగనన్న సురక్ష' లక్ష్యం

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత
- నేటి నుంచి జగనన్న సురక్ష కార్యక్రమాలు

గుంటూరు రూరల్: అర్హులైన ప్రతి ఒక్కరికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అందించటం లక్ష్యంగా జగనన్న సురక్ష కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు మాజీ మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి గ్రామంలో నేటి నుంచి నెల రోజులపాటు జగనన్న సురక్ష కార్యక్రమాలను నిర్వహించటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులనుంచి గ్రామ స్థాయి సచివాలయం అధికారుల వరకూ పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో ప్రజలకు సంభందించిన సమస్యల అర్జీలను స్వీకరిస్తు వాటి పరిష్కారాల దిశగా కృషిచేస్తారన్నారు. కార్యక్రమంలో 11 రకాల సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. గ్రామంలోని ప్రజలకు సంభందించిన రెవిన్యూ, ఆధార్, సంక్షేమ పథకాలు అందని ఏదైనా సాంకేతిక లోపాలున్నా, ఇతర సమస్యలున్నా వాటిని ప్రజలనుంచి అర్జీలను స్వీకరిస్తారన్నారు. అనంతరం వాటి పరిష్కారాలను చూపుతారని తెలిపారు. భారతదేశ చరిత్రలో ఎన్నికల సమయంలో చేసిన వాగ్దానాలను 99 శాతం అమలు చేసిన ఏకైక పార్టీ వైఎస్సార్ సీపీ మాత్రమేనని తెలిపారు. ప్రజలు జగనన్న ఇస్తున్న సంక్షేమ పథకాలతో సంతోషంగా ఉంటే చూసి ఓర్వలేక చంద్రబాబు మరలా ప్రజలను మరోసారి మోసం చేసేందుకు అబద్ధాలు ప్రచారం చేస్తున్నాడన్నారు. ప్రజలు చంద్రబాబు కల్లబొల్లి మాటలు, దత్తపుత్రుడు అబద్ధపు ప్రచారాలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. రానున్న ఎన్నికల్లో జగనన్నకు అఖండ మెజారిటీని ఇచ్చి మరోసారి ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రతి ఒక్కరూ సైనికుల వలే సిద్ధమవ్వాలన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమాలు ప్రజలు సద్వినియోగించుకోవాలని సూచించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకతోటి సుచరిత

ప్రజా సమస్యల పరిష్కారానికే 'గడప గడపకు'

ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య

పెదకాకాని: రాష్ట్ర ప్రభుత్వం పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య అన్నారు. పెదకాకాని మండలం తక్కెళ్ళపాడులో మూడవరోజు శుక్రవారం మూడవరోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. గ్రామంలోని ఎస్టీకాలనీ, బీసీ కాలనీ ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ బుక్‌లెట్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజా సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పరిపాలన సాగుతోందన్నారు. ప్రజా సంకల్పయాత్రలో ప్రజల సమస్యలు స్వయంగా తెలుసుకుని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేనిఫెస్టో ప్రకటించడం జరిగిందన్నారు. అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా పరిపాలన సాగుతుందన్నారు. ప్రభుత్వం పథకాల ద్వారా కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నాయన్నారు. ప్రతి గడపకూ వెళ్ళి అమ్మా బాగున్నారా ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా, ప్రతి నెల 1వ తేదీన వలంటీర్‌లు ఇంటికి వచ్చి పెన్షన్‌లు ఇస్తున్నారా అంటూ ఆప్యాయంగా పలుకరించారు. తక్కెళ్ళపాడులో ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్యకు అడుగడుగునా ప్రజలు స్వాగతం పలికారు. ప్రజలు కాలువల ఏర్పాటు, తాగునీరు, ఇళ్ళ స్థలాలు వంటి సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెచారు. ఈ కార్యక్రమములో ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు, జడ్పీటీసీ గోళ్ళ జ్యోతి, ఎంపీడీఓ బీవీ మల్లేశ్వరరావు, వార్డు మెంబర్ షేక్ ఖాశిం, కిలారి రమేష్, మేరుగ సుబ్బారావు, పెనుమాల అరుణ్‌గాంది, పెరవలి కిషోర్, అప్పసాని చంద్రశేఖర్, ఎస్‌కె బాబావలి, పేరం రాఘువులు, సాంబశివరావు, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



తక్కెళ్లపాడులోసంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య

ప్రతి విద్యార్థికీ విద్యాకానుక కిట్లు

ఎంఈవో–2 లీలారాణి



ఎల్ఈ పాఠశాలలో ఆకస్మిక తనిఖీ చేస్తున్న ఎంఈవో–2 లీలారాణి

ప్రత్తిపాడు: పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న ప్రతి ఒక్క విద్యార్థికీ జగనన్న విద్యాకానుక కిట్లు అందజేయాలని ఎంఈవో–2 జి. లీలారాణి అన్నారు. మండల పరిధిలోని ప్రత్తిపాడు, పాతమల్లాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో జరుగుతున్న స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను శుక్రవారం లీలారాణి పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ పాఠశాలల్లోని ఉపాధ్యాయులంతా క్రమం తప్పకుండా డెయిరీ రాయాలన్నారు. విద్యార్థుల నోట్‌బుక్స్ ఎప్పటికప్పుడు కరెక్షన్స్ చేయడంతో పాటు వర్క్‌బుక్స్ కూడా స్కూల్లోనే రాయించాలని సూచించారు. జగనన్న గోరుముద్ద పథకం అమలులో ఎలాంటి అలసత్వం లేకుండా ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు అందించాలన్నారు. జగనన్న విద్యాకానుక కిట్లు విషయంలో హెచ్ఎంలు, ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ నెలలో కమిషనర్ నేరుగా విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్ చేసి కిట్లు విషయమై ఆరా తీసే అవకాశం ఉందని తల్లిదండ్రులకు విషయాన్ని తెలియజేయాలన్నారు. అనంతరం ప్రత్తిపాడు ఎల్ఈ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల విద్యాప్రమాణాలను పరిశీలించారు.

ప్రత్తిపాడు జేసీఎస్ కన్వీనర్‌గా వేలూరి

ప్రత్తిపాడు: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రత్తిపాడు మండల జేసీఎస్ కన్వీనర్‌గా ప్రత్తిపాడు గ్రామానికి చెందిన వేలూరి లక్ష్మారెడ్డిని నియమించారు. ఈ మేరకు కేంద్ర పార్టీ కార్యాలయం నుండి గురువారం ఆదేశాలు వెలువడిన సంగతి తెలిసిందే. పార్టీ అధిష్టానం తనపై పెట్టుకున్న నమ్మకానికి తగినట్లుగా పనిచేయడం జరుగుతుందని లక్ష్మారెడ్డి తెలిపారు.

జేసీఎస్ మండల కన్వీనర్‌గా పంగులూరి

కాకుమాను: వైఎస్సార్ సీపీ జేసీఎస్ మండల కన్వీనర్‌గా కాకుమానుకు చెందిన పంగులూరి శ్రీనివాసరావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు వ్యవసాయ సలహా కమిటీ జిల్లా చైర్మన్ నల్లమోతు శివరామకృష్ణ శుక్రవారం తెలిపారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ తనకు పదవి రావడానికి కృషి చేసిన ప్రత్తిపాడు ఎమ్మెల్యే మేకతోటి సుచరితకు జీవితాంతం రుణపడి ఉంటానని ఆయన తెలిపారు.

భర్తపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: భార్యను కేసు విత్‌డ్రా చేసుకోని భర్త బెదిరించిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. శివరామ్‌నగర్‌కు చెందిన ఎస్.గీతిక కన్నావారితోట ఐదోలైనులో తన భర్త అమృతలూరి వెంకటేశ్వరరావు కార్యాలయానికి వెళ్లింది. వెంకటేశ్వరరావు తనపై పెట్టిన కేసు విత్‌డ్రా చేసుకోవాలని భార్య గీతకను దుర్భాషలాడి బెదిరించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అంతర్ జిల్లాల ఘరానా దొంగ అరెస్ట్

- తాళాలు వేసిన ఇళ్లే టార్గెట్
- రూ.10 లక్షల విలువగల బంగారు ఆభరణాలు స్వాధీనం

పెదకాకాని: తాళాలు వేసి ఉన్న ఇళ్లే టార్గెట్‌గా దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్జిల్లాల ఘరానా దొంగను అరెస్టు చేసినట్లు గుంటూరు జిల్లా క్రైం అడిషనల్ ఎస్పీ ఎ.శ్రీనివాసరావు తెలిపారు. పెదకాకాని పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. పెదకాకాని గౌడపాలేనికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ కారంకి హరిబాబు ఇంట్లో మే 5న ఎవరూ లేని సమయంలో దొంగతనం జరిగింది. హరిబాబు భార్య ఉదయం వచ్చి చూసే సరికి బంగారు వస్తువులు, నగదు చోరీకి గురైనట్లు గుర్తించింది. భర్త హరిబాబుకు సమాచారం ఇవ్వడంతో అతని ఫిర్యాదు మేరకు..పెదకాకాని పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. సీఐ బండారు సురేష్‌బాబు దర్యాప్తు చేపట్టారు. ఇంటి ముందు సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడు పల్నాడు జిల్లా, వినుకొండ మిద్దె భావి సెంటర్‌కు చెందిన దేవరకొండ రాంబాబుగా గుర్తించారు. నిందితుడు ప్రస్తుతం విజయవాడ వాంబే కాలనీలో నివసిస్తున్నట్లు నిర్ధారించుకున్నారు. శుక్రవారం పెద్దకాకాని శివాలయం ఎదురుగా గోళ్ళమూడి రోడ్డులో నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి రూ.10లక్షల విలువ గల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు.



విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న క్రైం అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు

తాళాలు వేసి ఉన్న ఇళ్లే టార్గెట్:

నిందితుడు దేవరకొండ రాంబాబు తాళాలు వేసి ఉన్న ఇళ్లే టార్గెట్‌గా చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్నాడు. వ్యసనాలకు బానిసయ్యి.. అక్రమంగా డబ్బులు సంపాదించాలనే దురాశతో దొంగతనాలకు పాల్పడ్డాడు. పెదకాకానిలో చోరీ చేయడంతో పాటు ఎన్టీఆర్, పశ్చిమగోదావరి, కోనసీమ, నంద్యాల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో కూడా 8 చోట్ల దొంగతనాలకు పాల్పడ్డట్లు పోలీసులు తెలిపారు. రాంబాబుపై తెలుగు రాష్ట్రాల్లో సుమారు వంద కేసులకుపైగా నమోదై.. జైలుకు వెళ్లినట్లు తెలిపారు. నిందితుడ్ని అరెస్టు చేసి, కోర్టుకు హాజరు పరచనున్నట్లు గుంటూరు అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. పెదకాకాని ఎస్ఐ బండారు సురేష్ బాబు, సీసీఎస్ సీఐలు డి.శ్రీనివాసరావు వెంకన్న చౌదరి, పెదకాకాని ఎస్ఐ వి.రాంబాబు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీఈవోలకు సామర్థ్యం పెంపు శిక్షణ తరగతులు

గుంటూరు రూరల్: ప్రతి అధికారి రైతు భరోసా కేంద్రాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం, వ్యవసాయ శాఖ అమలు చేస్తున్న ప్రతి పథకాన్ని రైతులకు పారదర్శకంగా అందించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నున్న వెంకటేశ్వర్లు సూచించారు. శుక్రవారం నగరంలోని కృషి భవన్‌లో ఏర్పాటు చేసిన సహాయ వ్యవసాయ సంచాలకులు (రెగ్యులర్) సబ్ డివిజన్ పరిధిలోగల 7 మండలాల మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ ఉద్యాన సహాయకులు, ఎంపీఈఓలకు సామర్థ్య పెంపు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. డీఆర్సి గుంటూరు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందు ప్రధాన పంటలైన పత్తి, మిరప, వరి, అపరాల సాగులో మెలకువలు, చీడపీడల నియంత్రణ పైన శాస్త్రవేత్తలు, అధికారులు తగిన శిక్షణ ఇచ్చారు. జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ ప్రతి అధికారి రైతు భరోసా కేంద్రాల ద్వారా వ్యవసాయ శాఖ అమలు చేస్తున్న ప్రతి పథకాన్ని, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు రైతులకు పారదర్శకంగా అందించాలని సూచించారు. రాబోవు సీజన్లో జరిగే పథకాల గురించి గుంటూరు సబ్ డివిజన్ పరిధిలోని వ్యవసాయ అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఉప సంచాలకులు రామాంజనేయులు, జిల్లా ఉద్యాన అధికారి రవీంద్ర, వరి ప్రధాన శాస్త్రవేత్త ఎస్ సాంబశివరావు, మిరప శాస్త్రవేత్త ఫణి కుమార్, గుంటూరు సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీనివాసరావు, ప్రకృతి వ్యవసాయం డిపియం రాజకుమారి, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ గంగాదేవి, ఏడు మండలాల వ్యవసాయ అధికారులు, ఉద్యాన అధికారులు, ఇంటిగ్రేటెడ్ ల్యాబ్ వ్యవసాయ అధికారి రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నున్న వెంకటేశ్వర్లు తదితరులు

నేడు పాతమల్లాయపాలెంలో జగనన్న సురక్ష

ఎంపీడీవో శ్రీరమ్య

ప్రత్తిపాడు: మండల పరిధిలోని పాతమల్లాయపాలెంలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఏ. శ్రీరమ్య తెలిపారు. ఉదయం నుండి సాయంత్రం ఐదు గంటల వరకు మండల స్థాయి అధికారులంతా గ్రామంలోని సచివాలయంలో అందుబాటులో ఉంటారని తెలిపారు. ప్రజలు తమకున్న సమస్యలపై క్యాంప్‌లో తెలియజేయవచ్చన్నారు. గ్రామంలో అర్హత ఉండీ పథకాలు అందని వారు ఎవ్వరైనా ఉంటే క్యాంప్‌కు హాజరు కావాలని కోరారు. జనన, మరణ, కుల, ఆదాయ,ఫ్యామిలీ మెంబర్, వివాహ ధృవీకరణ పత్రాలతో పాటు లావాదేవీ మ్యుటేషన్లు, ఆధార్‌కు ఫోన్ నంబరు అనుసంధానం, సీసీఆర్‌సీ కార్డులు, కొత్త రేషన్ కార్డు లేదా రేషన్ కార్డు విభజన, ప్రభుత్వ డేటాకు సంబంధించి కుటుంబ వివరాల్లో మార్పులు చేర్పులు అంశాలను ఉచితంగా చేయడం జరుగుతుందని వివరించారు.

మండలంలో క్యాంప్‌ల షెడ్యూల్ ఇలా..

- 1వ తేదీన పాతమల్లాయపాలెం, 4వ తేదీన తిక్కిరెడ్డిపాలెం, 6న కోయవారిపాలెం, 7న గనికపూడి, 11న తుమ్మలపాలెం, 13న యనమదల, 15న వంగిపురం, 18న ప్రత్తిపాడు–1, 20న ప్రత్తిపాడు–2, 22న ప్రత్తిపాడు–3, 25న నడింపాలెం–1, 27న నడింపాలెం–2, 28న గొట్టిపాడు గ్రామాల్లోని సచివాలయాల్లో క్యాంప్‌లు జరగనున్నాయని ఎంపీడీవో వివరించారు.

వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవంలో ఎమ్మెల్యే కిలారి, క్రికెటర్ రాయుడు

చేబ్రోలు: పొన్నూరు రురల్ మండలం వెల్లలూరు గ్రామంలోని గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శుక్రవారం జరిగిన వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవంలో పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య, ప్రముఖ క్రికెటర్ అంబటి తిరుపతి రాయుడు పాల్గొన్నారు. రాజ్యలక్ష్మి, గోదాదేవి సమేత వెంకటేశ్వర స్వామి కల్యాణోత్సంలో పాల్గొన్న కిలారి వెంకట రోశయ్య, అంబటి తిరుపతి రాయుడులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండితులు ఆశ్వీరదించారు. కల్యాణోత్సవ కార్యక్రమంలో వెల్లలూరు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామ సర్పంచ్ ఇక్కుర్తి మల్లికార్జునరావు, ఆలయ కమిటీ చైర్మన్ బండి రేణుకయ్య, రాష్ట్ర పశుసంవర్థకశాఖ డైరక్టర్ కొఠారి వెంకట రమణ, వైస్ ఎంపీపీ అంబటి రాఘవయ్య,పెరవలి మస్తాన్, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.



వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవంలో ఎమ్మెల్యే కిలారి, అంబటి తిరుపతిరాయుడు

దాడి కేసులో నిందితులు అరెస్టు

పట్నంబజారు: వ్యక్తిపై దాడిచేసి నగదు దోచుకుపోయిన సంఘటనలో నిందితులను పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బుడంపాడు గ్రామానికి చెందిన లక్కాకుల సుబ్బారావు జూన్ 26న కొల్లిశారదా మార్కెట్‌కు వచ్చి కూరగాయలు కొనుగోలు చేసి తిరిగి ఊరు వెళుతున్న సమయంలో శ్రీచైతన్య కాలేజీ వద్ద నలుగురు వ్యక్తులు కారులో నుండి దిగి ఇష్టమొచ్చినట్లు కొట్టి రూ.18 వేలు నగదు లాక్కొని పరారయ్యారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా, సాంకేతిక పరిజ్ఞానంతో నిందితులు నరసరావుపేటకు చెందిన షేక్ సైదావల్లి, నల్లచెరువుకు చెందిన షేక్ గౌస్‌బాషా, షేక్ మొహమ్మద్ ముస్తకిన్, షేక్ మస్తాన్‌వలి నలుగురిని అదుపులోకి తీసుకుని విచారించారు. వారి నుంచి రూ. 17,500, కారు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

గుంటూరు మెడికల్: డాక్టర్స్ డే సందర్భంగా కేర్‌వెల్ సూపర్‌స్పెషాలిటీ హాస్పటల్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ షేక్ నాగూర్‌బాషా శుక్రవారం తెలిపారు.